


ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి :5 సంచిక : 8 పుష్యం : 30-33 ఎడిటింగ్ : పి. హెచ్. వి. సత్యవతి (హైమ)

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, జిన్నూరు, 31-3-2000

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనకు అనేక ఇంద్రియాలు ఉన్నాయి. కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు ఉన్నాయి కాని మనస్సు ఒక్కటే. దాని మూలంలోనికి మనం వెళ్ళగలిగితే, వెళ్ళి అక్కడ స్థిరంగా ఉండగలిగితే దైవస్వరూపం పొందుతారు అంటే మోక్షం పొందుతారు. లోకంలో అనేక నామరూపములు ఉన్నాయి, అనేక వస్తువులు ఉన్నాయి, అనేక ఆకర్షణలు ఉన్నాయి. ఇంద్రియాల ద్వారా మనస్సు వెళ్ళివాటితో తాదాప్యం పొందుతుంది. ఆ మనస్సులో పరివర్తన రావాలి. మనస్సుకు బయటకువెళ్ళే ఈఆకర్షణ తగ్గాలంటే సత్వగుణం సంపాదించాలి. అభ్యాసం, వైరాగ్యం ఉండాలి. సత్యం నీ హృదయంలో ఉంది. అది నీకు అత్యంత సమీపములో ఉన్నప్పటికి అభ్యాసం లేకపోతే, వైరాగ్యం లేకపోతే కోటిజన్మలు ఎత్తినా అది నీకు అనుభవంలోనికి రాదు అని భగవంతుడు గీతలోచెప్పాడు. సహజంగా నీ మనస్సు బాహ్యాముఖంగా వెళుతూ ఉంటుంది. మనస్సుకు అంతర్దృష్టి కలుగజేయటం కోసం యోగులు, ఋషులు, మహాత్ములు ప్రయత్నం చేస్తారు. సత్యం నీ హృదయంలోనే ఉంది. అది నీకు అనుభవంలో లేదు కాబట్టి అది లేదు అనుకొంటున్నావు. మనం చేసే అధ్యయనాల వలన, ధ్యానం వలన, యోగాభ్యాసాలవలన 50 శాతం మార్కులు వస్తే, మన హృదయంలో సద్వస్తువు ఉంది అని సజీవమైన విశ్వాసం ఉన్నవాడికి 50 శాతం మార్కులు ఇస్తారు. అంటే విశ్వాసం కుదరాలి. అలా గాంధీగారికి రామనామం మీద విశ్వాసం కుదిరింది. ఆయనను తుపాకీతో కాల్చినప్పుడు కూడా హేరామ్ అన్నారు. భగవంతుడిని నమ్మి చెడిపోయిన వాడు ఈ సృష్టిలో ఎవడూలేడు. ఆయన మీద సజీవమైన

విశ్వాసం ఉంటే ఉద్ధరింపబడతాడు.

భగవాన్ ఎక్కువ మౌనంగా ఉండేవారు. మౌనంగా ఉండి నీ మనస్సును లోపలకు తీసుకొని వెళ్లటానికి చూస్తారు. మౌనబోధ అర్ధం చేసుకొనే పరిణితి నీకు లేనప్పుడు మధ్యలో మాటలు చెపుతారు. మాట ప్రధానం కాదు. పరిణితి ఉన్నప్పుడు మౌనమే చాలు జ్ఞాని యొక్క మౌనం వలన నీ మనస్సులో మార్పు వస్తూ ఉంటే ఈ ఉపన్యాసాలు, రచనలు మాటలు అక్కరలేదు అయితే దానికి చాలా ట్రైనింగ్ ఉండాలి. నాపట్ల మీరు గౌరవంగా వ్యవహరిస్తున్నారు అనుకోండి మీ పట్లనేను గౌరవంగా వ్యవహరించడం తేలిక. కాని నాపట్ల మీరు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు అనుకోండి అప్పడు కూడా నేను మీ పట్ల సభ్యతగా, గౌరవంగా ప్రవర్తిస్తే అప్పడు జ్ఞాని యొక్క మౌనం నాగుండెకు తాకుతుంది. మీ ఇంట్లో అభిప్రాయ బేధాలు ఉన్నాయి అనుకోండి. వాటిని పరిష్కారం చేసుకోవటానికి చూసుకోండి. అంతేగాని వాటిని కలహాలుగా మార్చుకొని రోడ్డు మీద పడకండి. కలహాల వలన రజోగుణం పెరుగుతుంది, సత్వగుణం తగ్గిపోతుంది, శాంతికి ఆనందానికి దూరమయిపోతారు అని బాబా చెప్పారు. జ్ఞాని యొక్క మాటలను మనం శ్రద్ధగా వింటే, వాటిగి ధ్యానం చేస్తే మనం విన్న మంచి మాటలు మనం చేసిన మంచి మన జీవితంలో మనలను తరుముకొంటూ వస్తుంది. మనం మంచి చేస్తే మంచి, చెడ్డచేస్తే చెడ్డ ఏది చేస్తే అది మన వెనకాల వస్తుంది. మీ జీవితంలో ఏదైనా మంచి జరిగినా, చెడ్డ జరిగినా ఏమిటి ఇలా చెడ్డ జరిగింది, మంచి జరిగింది ఏమిటి అని మీరు అనుకోవచ్చు కాని దానికి మీ పూర్వజన్మలకు ఎక్కడో ఒక చోట కనెక్షన్ ఉంటుంది అని బాబా చెప్పారు. జ్ఞాని యొక్కమాట ఎందుకు శాశ్వతంగా ఉంటుంది అంటే అది హృదయంలో నుండి వస్తుంది. ఏ హృదయంలో అయితే మనస్సు అణిగిందో, ఎక్కడయితే మనస్సు హృదయాకారం చెందిందో అక్కడ నుండి ఆధ్యాత్మికశక్తి పరిసరాలకు వ్యాపిస్తుంది. పరిసరాలకేకాదు నదులను సముద్రాలను దాటి ప్రవహిస్తుంది. నీకు ధనం అక్కరలేదు, అధికారం అక్కరలేదు ఇవి అన్నీ ప్రకృతి గుణాలు. నీకు ఈశ్వరుడి మీద సజీవమైన విశ్వాసం ఉంటే అదే నిన్ను రక్షిస్తుంది. దానికి తిరుగులేదు. మౌనం అన్నింటికంటె బలీయమైనది. మీరు

బాగుపడాలని నేను నోటితో చెప్పనక్కరలేదు. మీరు బాగుపడాలనే ఆరాటన నా హృదయంలో ఉంటే నోటితోమాట చెప్పనక్కరలేదు. నోటితో చెప్పిన దానికంటే హృదయంలో మీ పట్ల నాకున్న స్పందన బలీయంగా పనిచేస్తుంది.

మీ శరీరాన్ని నడిపేది మనస్సు ఆ మనస్సును నియమించుకొంటే మీకు ఉజ్వలమైన భవిష్యత్ ఉంటుంది. మనస్సును నియమించుకోలేకపోతే ఆధ్యాత్మికంగాను, భౌతికంగాను అభివృద్ధిలోనికి రాలేరు. మనస్సును నియమించుకోవటానికి మీరు ఎంతోకొంత ప్రయత్నం చేస్తూ ఉంటే జ్ఞాని ద్వారా మీకు సహాయం అందుతుంది. దైనందిన జీవితంలో మీరు ఎలా వ్యవహరించినా, ఏమి చేసినా మీరు సన్యాసం తీసుకొన్నా గృహస్థాశ్రమంలో ఉన్నా ఎలా ఉన్నా మీ గమ్యం మోక్షం. దానిని మిస్ అవ్వకూడదు. దానిని చేరుకోవటానికి మన మనస్సును తీర్చిదిద్దుకోవాలి. ఎదుటి వారి ప్రవర్తన బాగా లేదు అని మీరు అంటారు ఎందుకు? ఆ ప్రవర్తన మీరు కలిగిఉండకండి. అదే ప్రవర్తన మీరు కలిగిఉంటే మీకు రజోగుణం వస్తుంది. ఎదుటి వారు మీ పట్ల అసభ్యంగా ప్రవర్తించినా మీరు సభ్యతగా ప్రవర్తిస్తే మీ మనస్సుకు కంట్రోలు వస్తుంది. వారు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు అని మీరు కూడా అసభ్యంగా ప్రవర్తిస్తే మీకు ఉన్న కంట్రోలు జారిపోతుంది అని బాబా చెప్పారు. ఎవరైనా చెడ్డచేస్తే నీవు కూడా వాడికి చెడ్డచేయటం అనేది మామూలుగా జరుగుతుంది. కాని ఎవరైనా చెడ్డ చేసినప్పుడు ఆ చెడ్డను మర్చిపోయి వాడికి మంచి చేయగలిగితే అప్పుడు కదా నీ ఆధిక్యత, అప్పుడు కదా నీవు దేవుని అనుగ్రహానికి పాత్రుడవు అయ్యేది. మనం చేసేపనికి మన మనస్సు అడ్డురాకుండా చూసుకోవాలి. మా ఇంట్లో మామిడిపండ్లు ఉన్నాయి. మా అత్తగారికి భోజనంపెట్టాను అందులో మామిడిపండు వేద్దామని అనుకొన్నాను. కాని కొత్తగానేను వచ్చినప్పుడు ఆవిడ అన్నమాటలు జ్ఞాపకంవచ్చి మామిడిపండు వేయలేకపోయాను ఇంకనాకుమోక్షం ఏమిటి అని ఒక అమ్మగారుచెప్పారు. ఆవిడ చెప్పింది నిజమే అవిడ సాధన చేస్తున్నారు కాబట్టి ఆ మాటలు చెప్పారు. మనం చేయటం లేదు కాబట్టి ఇటువంటి సందేహాలు మనకు రావటం లేదు. ఆవిడలో ఉన్న బలహీనతను ఆవిడ గుర్తిస్తున్నారు. ఇప్పుడు అందులో నుండి బయటకు

రాలేకపోవచ్చు కాని బలహీనతను ఆవిడ గుర్తిస్తున్నారు. కాబట్టి అక్కడ సాధన ఉంది అని అర్థం. మనం మంచి పనులు చేసేటప్పుడు కూడా మనస్సును కలవనియ్యకూడదు. మనస్సు కలిసిందా ఆ పని అంతా పాడుచేసేస్తుంది. మన మనస్సులో ఏ బలహీనతలు ఉన్నాయి, వాటిలో నుండి ఎలా బయటపడాలి అనేది చూసుకోవాలి.

అహంభావన పెట్టుకొని కొంతమంది మంచిపని చేస్తారు. మంచి పని వలన పుణ్యం వస్తుంది కాని అహంభావన పోదు. సాధన పేరుమీద ఎందుకు కష్టపడుతున్నావు, ఎందుకు గోలపెడుతున్నావు. నేను అనే తలంపును తీసి ఒక ప్రక్కన పెట్టు నీకు సాధనతో పనేలేదు అన్నారు భగవాన్. నేను అనే తలంపును తీసి ఒకప్రక్కన పెట్టు అది జ్ఞానమార్గం. అది చేయలేకపోతే ఈశ్వరుడికి ఇచ్చేయి అది ప్రపత్తి మార్గం. నీ సంకల్పమే నా సంకల్పం అనే భావన మనకు వస్తే ఈ నేను పోతుంది, దాని స్థానంలో భగవంతుడు కూర్చొంటాడు అదీ రహస్యం. భగవంతునిపై సజీవమైన విశ్వాసం కలిగిఉండు. దేని కోసం ఎదురు చూడవద్దు శివుడి పేరు ఎత్తవద్దు మేము విష్ణుభక్తులము అని కొంతమంది చెపుతారు. ఈ పొరపాటు అంతా గురువులలో ఉంది. మిమ్మల్ని ఎక్కడికి తీసుకొని వెళ్ళాలో గురువులకు తెలిస్తే కదా. శివుడు యొక్క హృదయం విష్ణువు, విష్ణువు యొక్క హృదయం శివుడు. విష్ణువు శివుడిని ఆరాధిస్తూ ఉంటే, శివుడు విష్ణువును ఆరాధిస్తూ ఉంటే మధ్యన మీకు ఏమిటి ఈ గోల? మీకు విష్ణువు అంటే ఇష్టం అనుకోండి అన్ని దేవతలలో విష్ణువును చూస్తే సరిపోతుంది., రూపబుద్ధి, నామబుద్ధి చాలా ప్రమాదమైనవి. మీరు ఏ రూపాన్ని, ఏ నామాన్ని ఆరాధిస్తున్నారో అది ఒక్కటే ఎక్కువ అని మీరు అనుకొంటారు. మీరు పూజించే దేవుడు ఎక్కువ అని మిగతా దేవతలను అగౌరవపరచకూడదు. అలా చేస్తే మీకు నష్టం కలుగుతుంది. మహర్షుల సన్నిధిలో ప్రాపంచిక విషయములతో ఉన్న సంబంధం తొందరగా తగ్గిపోతుంది.

బాహ్యవిషయాలను భగవంతుడు చూడడు. నీలో అహంభావన ఉందా, లేదా అని చూస్తాడు. అహంభావన ఉంటే నిన్ను తీసి ఒక ప్రక్కన పెడతాడు. నీ ధనాన్ని గాని, చదువును గాని భగవంతుడు ఏమీ చూడడు. అవి అన్నీ ప్రకృతి విషయాలు. అవి నీదేహ

ప్రారబ్ధాన్ని బట్టి వస్తాయి పోతాయి. భగవంతుడు చెప్పిన మాట మీదు నీకు గౌరవం లేనప్పుడు భగవంతుడి మీద నీకు గౌరవం ఎలా కలుగుతుంది. దేవుడు వేరు, నేను వేరు అన్నప్పుడు అది పరమస్థితి కాదు. ఆ బేదబుద్ది కూడా నశించాలి. భేదబుద్ది అలాగే ఉండిపోతే అందులోనుండి దుఃఖం వస్తుంది, భయం వస్తుంది, కోరిక వస్తుంది. బేద బుద్ది నశించినప్పడు ఏదీ లేదు ఉన్నది ఒక్కటే. అద్వైతానుభవం ఎవడైతే పొందాడో వాడికి బాహ్యప్రపంచం తోటి ఎట్టి సంబంధం లేదు. ఏ వస్తువు మీద వాడు ఆనందం కోసం ఆధారపడి ఉండడు. అది అమృతానుభవం. అమృతం నీ హృదయంలోనే ఉంది. దాని తాలుక అనుభవం నీకు లేదు. అమృతం, అమృతం అని నీవు స్మరించటం వలన దాని రుచి నీకు తెలియదు. దానిని అనుభవంలోనికి తెచ్చుకోవాలి. అప్పుడు దానియొక్క వైభవం నీకు తెలుస్తుంది. కాళ్ళు నడుస్తూ ఉండాలి. చేతులు పనిచేస్తూ ఉండాలి. కళ్ళుచూస్తూ ఉండాలి. అగాధమైన సుఖం, శాంతి, ఆనందం నీ హృదయంలో ఉండాలి. అప్పుడు మోక్షం నిన్ను వరిస్తుంది.

చనిపోయిన తరువాత ఏమౌతాము అని కంగారుపడుతున్నారు. అది కూడ ఒక తలంపే. మీరు ఏమీ అవ్వరు. మీరు మీరుగానే ఉంటారు. ఇప్పుడు మీరు ఎవరో మీకు తెలియదు చనిపోయిన తరువాత గొడవ ఎందుకు అంటున్నారు భగవాన్. ఎంతసేపు స్వర్గంగొడవ, నరకం గొడవ, చనిపోయిన తరువాత ఏమౌతాము అనే గొడవ ఈ గొడవే గాని ఏదైతే నీలోపల నేనుగా వ్యక్తమవుతోందో దానిని విచారణ చేయుటం లేదు అందువలన నీకు వస్తువు తెలియుటంలేదు. స్వర్గంలోనికి వెళితే కొంత సుఖం అనుభవించవచ్చు, నరకం లోనికి వెళితే కొంత దుఃఖం అనుభవించవచ్చు తిరిగి మరల ఈ భూమి మీదకు రావాలి. అసలు ఈ దుఃఖం అనుభవించేవాడు ఎవడు? ఈ సుఖం అనుభవించేవాడు ఎవడు? అనే విచారణ ఎవరూ చేయుటం లేదు, అందుచేత వాడి మూలం ఏమిటో వాడికి తెలియటంలేదు. ఈ స్వర్గం, నరకం, కైలాసం, వైకుంఠం ఇవి అన్నీ పాక్షిక సత్యములు మాత్రమే. పారమార్థిక సత్యములు కాదు. ఎందుచేతనంటే గాఢనిద్రలో ఎవరికి స్వర్గం గొడవ, నరకం గొడవ ఈ గొడవలు ఏమీ రావటం లేదు.

నేను అనే తలంపు వచ్చాక ఈ గొడవలు వస్తున్నాయి గాని నేను అనేతలంపు ఉదయించక ముందు గాఢనిద్రలో ఉండగా ఈ లోకాలకు సంబంధించిన ఆలోచన ఎవరికీ లేదు. ఈ శరీరం చనిపోయిన తరువాత ప్రయాణించే వాడు ఎంత నిజమో ఈ లోకాలు కూడ అంతే నిజం.

మీరు ఎవరిని చూసి భయపడవద్దు. మీరు ఎవరిని భయపెట్టకండి. భయం వదులుకొంటే లోపల ఉన్న శాంతి కెరటాలుగా వచ్చి మీ సహస్రారాన్ని ముంచేస్తుంది. నీలో ఉన్న బలహీనతలు పోగొట్టుకోవటం చాలా కష్టం అని మీరు అనుకొంటున్నారు. నీవు రవ్వంత విచారణచేస్తే, ఎంతోకొంత ప్రయత్నం చేస్తే అవిపోతాయి. ప్రయత్నం చేసినా అవిపోవు అనుకొనేది కూడా ఒక తలంపే. నీవు ప్రయత్నం చేస్తూ ఉంటే నీ కృషే కృపగా మారుతుంది. ఎప్పుడు వాయిదాలువద్దు. ఇప్పుడే ఈ లోకంలోనే, ఈ జన్మలోనే పొందవలసింది పొందుతావు. నీ హృదయంలో ఉన్న ఆనందం ముందు, శాంతి ముందు, దుఃఖ మిశ్రమంలేని ఈ సుఖంముందు వైకుంఠంలో ఉన్న ఆనందం ఏపాటిది. ఇక్కడ ఉన్నది నీరు అయితే వైకుంఠంలో ఉన్న ఆనందం నీటితుంపర. ఈశ్వర సంకల్పం లేకుండా ఏమీ జరగదు అని నిర్ధారణ నీకు ఉన్నప్పుడు లోపల నుండి కంగారు రాదు, నెమ్మదిగా కుదురుగా ఉంటావు. భగవంతుడు ఒకోసారి మీకు బాధలు పంపుతాడు. ఆ బాధద్వారా మీకు బోధచేయటం కోసం బాధలు పంపుతాడు అంతేగాని మిమ్మల్ని బాధపెట్టటం కోసం కాదు. ఆయనకు మీమీద కోపం లేదు. మిమ్మల్ని పవిత్రం చేయటం కోసం, మీలో ఉన్న జ్ఞాన నేత్రం తెరవబడటం కోసం మీమీద ఒకోసారి ఆగ్రహం కూడా చూపిస్తాడు. అది ఆగ్రహంకాదు అది కూడా అనుగ్రహమే. మీకు సత్పురుషుల సహవాసం దొరికితే నియమాలతో పనిలేదు. నీవు మట్టిలాంటి వాడవే అయినా హోలి కంపెనీ నిన్నుబంగారం చేస్తుంది. తిరస్కారభావనతో మాట్లాడవద్దు. మీదగ్గరకు ఎవరైనా పని కోసం వస్తారు అనుకోండి చేయగలిగిన పనులు చేయవచ్చు. అన్నిపనులు మీరు చేయలేరు కదా. నేను చేయలేను అని చెప్పటం కూడా ఉద్రేకంగా ఉండకూడదు, మర్యాదపూర్వకంగా చెప్పాలి. మాటలో కాలిన్యం ఉంటే, కాలుష్యం ఉంటే మీరు లోపల కుళ్ళిపోతారు. కొంతమందికి

పరుష వాక్యాలు వారినోటి నుండి రావు వారు ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతారు. మీ భక్తిని పూజగదికి పరిమితం చేసుకోవద్దు. భగవదనుభవం పొందటానికి మీ దైనందిన జీవితంలో ఏదైతే అడ్డువస్తోందో దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయండి. మీకు సంతోషం రావచ్చు, దుఃఖం రావచ్చు, గత జన్మకి దీనికి సంబంధం ఉంటుంది. కాల ప్రవాహంలో అదీపోతుంది, ఇదీపోతుంది. దానిని బట్టి మీమనస్సును పుండుచేసుకోవద్దు, కంగారు పడవద్దు. మీ లక్ష్యాన్ని, గమ్యాన్ని మర్చిపోవద్దు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-4-2000, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు శ్రీరామనవమి, రామచంద్రస్వామి భూమిమీద అవతరించిన రోజు, ఆదికావ్యం రామాయణం. వేదాలు, రామాయణం వేరుకాదు. వేదాల యొక్కసారం రామాయణం. వేదాలలో ప్రతిపాదించిన పురుషోత్తముడు రాముడు. ఆంజనేయస్వామిని సమర్థసద్గురువు అని బాబా చెప్పారు. సమర్థసద్గురువు అని ఎందుకు పేరు పెట్టాడు అంటే సీతమ్మ జీవుడు, రాముడు దేవుడు ఈ జీవుడిని పరమాత్మలో ఐక్యం చేసినవాడు ఆంజనేయస్వామి అందుచేత ఆయన సమర్థసద్గురువు. నిజమైన గురువు చేసే పని ఏమిటి అంటేజీవుడిని పరమాత్మలో ఐక్యం చేయాలి. ఆంజనేయస్వామికి మంగళవారం ప్రీతి అని చెపుతూ ఉంటారు. లంకలోనికి వచ్చి మొట్టమొదట సీతమ్మకు రాముడు యొక్క క్షేమంగురించి చెప్పిన రోజు మంగళవారం. అప్పుడు సీతమ్మ ఏమి చెప్పింది అంటే ఈ రోజు మంగళవారం, ఈ రోజు రామచంద్రస్వామి యొక్క క్షేమంగురించి తెలియపరచావు అందుచేత ఈ రోజు ఎవరైతే నిన్ను ఆరాధిస్తున్నారో వారికి అన్ని కోరికలు నెరవేరుగాక అని సీతమ్మ వరం ఇచ్చింది. మన శిరస్సు లంక, ఆయోధ్య ఆధ్యాత్మిక హృదయం ఇప్పుడు మనం లంకలో ఉన్నాము. అయోధ్య లోనికి ప్రయాణం చేయాలి. అంటే శిరస్సుండి హృదయంలోనికి ప్రయాణం చేయాలి. ఆ ప్రయాణం చేయటానికి సహకరించే వాడే

ఆంజనేయస్వామి అందుచేత ఆంజనేయస్వామిని సమర్థసద్గురువు అని బాబా చెప్పారు. శిరస్సులో ఉన్న జీవుడిని తన మూలస్థానమైన పాదంలోనికి అంటే తన స్వస్థానంలోనికి గురువు సహాయంతో తీసుకొని వెళ్ళాలి.

దైనందిన జీవితంలో మనం చేసే పనిని హడావుడిగా, కంగారుగా చేయకూడదు. రోజూ చేసే పనులు ప్రేమగా చేయాలి, ధార్మికమైన నిర్మలత్వంతో చేయాలి. ఏదో మనకు కలిసి వస్తుంది అంటే పనులు చేయకూడదు, ఆడంబరంగా చేయకూడదు. ధర్మబుద్ధితో చేయాలి. కొంతమంది తపస్సులు చేస్తారు లోపల శత్రుత్వం పెట్టుకొని చేస్తారు. పూర్వం ఒక గ్రామంలో ఇద్దరు శత్రువులు తపస్సు చేసారట. భగవంతుడు ఒకరికి దర్శనం ఇచ్చి నీకు ఏమి కావాలి అని అడిగాడు. ఇక్కడ ఇంకో వ్యక్తి తపస్సు చేస్తున్నాడు మీరు అతని దగ్గరకు వెళ్ళారా అని అడిగాడట. ముందు నీ దగ్గరకు వచ్చాను నీకు ఏమి కావాలో చెప్పు అని భగవంతుడు చెప్పాడు. అయితే అతను ఏమి కోరుకొంటే దానికి రెట్టింపు నాకు ఇవ్వండి అని చెప్పాడట. అప్పుడు భగవంతుడు రెండో వ్యక్తికి దర్శనం ఇచ్చి నీకు ఏమి కావాలో కోరుకో అని అన్నాడట. ఇక్కడ ఇంకోవ్యక్తి తపస్సు చేస్తున్నాడు వాడి దగ్గరకు వెళ్ళారా అని అడిగాడట. అతని దగ్గరకు వెళ్ళాను నీవు ఏమి కోరుకొంటే దానికి రెట్టింపు ఇవ్వమని అడిగాడు అని చెప్పాడట. అయితే నాకు ఒక కన్ను తీసివెయ్యండి అని అడిగాడట. అంటే వాడికి రెండు కళ్ళు పోతాయి శత్రుభావన ఎలా ఉందో చూడండి. తపస్సుచేస్తున్నారు కాని లోపల శత్రుత్వభావన పోలేదు. ఈ శత్రుత్వ భావన కొన్ని వేల జన్మలను తీసుకొని వస్తుంది. చేతితో మంచి పని చేయాలి, అది ప్రేమతో చేయాలి. హృదయంలో మంచి ఉద్దేశం ఉండాలి. వాంఛతో, అశాంతచిత్తముతో నీవు మంచి పనిచేసినా అది చెడ్డగా మారిపోతుంది. కొంతమందికి కారణం ఉండదు ఎప్పుడూ విసుగుగా, చిరాకుగా ఉంటారు. వారికి జ్ఞానంరాదు. నీలోపల ఉన్న వస్తువు ఎంత పవిత్రంగా ఉందో నీవు చేసే ప్రయత్నం కూడా అంత పవిత్రంగా ఉండాలి. నీవు అవలంబించే మార్గం చెడ్డగా ఉంటే నీవు ఏ ఫలితాన్ని అయితే కోరుకొంటున్నావో ఆ ఫలితం కూడా చెడ్డగా పరిణమిస్తుంది.

కలియుగం రోజులు బాగాలేవు, రోజులు మంచివి కావు అని అంటారు. నీ బుద్ధి

మంచిది అయితే నీవు కలియుగంలో ఉన్నా త్రేతాయుగంలో ఉన్నట్లే ఉంటుంది. కాలంలో మార్పులేదు, నీ బుద్ధిలో మార్పు వచ్చింది. నీ బుద్ధిని సరిచేసుకొంటే ఏ కాలంలో ఉన్న నీవు వైకుంఠంలో ఉన్నట్లే ఉంటుంది. నీ లోపలఉన్న చైతన్యానికి బంధంలేదు. దేహాభిమానమే బంధం. నీకు వైరాగ్యం కలుగచేసి, అభ్యాసం చేసే శక్తిని ఇచ్చి నీలో ఉన్న దేహాభిమానాన్ని తొలగించేవాడే గురువు. అప్పుడు గాని నీకు ఆత్మనిష్ఠకలుగదు. నిష్ఠకలిగితే నీ మనస్సు ఆత్మవైపుకు మళ్ళిపోతుంది. మనం పోగొట్టు కోవలసింది మనస్సునే అందుచేత మన మనస్సును మనం లెక్కచేయకూడదు ఎందుచేతనంటే అది మనం కాదు. మనస్సుకు ప్రాముఖ్యత ఇవ్వకూడదు. మనస్సుకు ప్రాముఖ్యత ఇవ్వకుండా ఉండాలంటే ఆ బలం మనకు గురువేఇవ్వాలి. రామాయణం ఎందుకు చదవమన్నారు రాముడుఎలా ప్రవర్తించాడో మనం కూడా అలా ప్రవర్తిస్తే మనకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. రాముడు బంగారు లేడి వెనుక పరుగుపెట్టాడు అనుకొంటాము. కాని మనకు ప్రతీది రోడ్డుమీద ఉన్న గడ్డపరక కూడా బంగారంగా కనిపిస్తుంది. లక్షణస్వామి ఒక గీత గీసి దానిని దాటి వెళ్ళవద్దు అని సీతమ్మకు చెప్పాడు. దాని అర్థం ఏమిటి అంటే నీకు అధికారం ఉన్నా, ధనం ఉన్నా నీవు హద్దులు దాటి వెళితే సీతమ్మకు పట్టిన గతే నీకు పడుతుంది అని చెప్పటం. నీ దేహానికి కేన్సర్ వచ్చింది అనుకో దానిని తొలగించుకోకపోతే అది నీ శరీరాన్ని ఎంత బాధపడుతుందో నీ మనస్సులో ఉన్న దురభ్యాసములు, దురలవాట్లు ఈ జీవుడిని అంత బాధపెడతాయి. శరీరానికి ఎన్ని రోగములు ఉన్నా స్మశానంలో శరీరం కాలినప్పడు అవి కూడా పోతాయి. కాని నీ మనస్సులో ఉన్న దురలవాట్లు, దురభ్యాసములు జన్మాంతరములోనికి వచ్చేస్తాయి.

ప్రారబ్దం., సంచితం,. ఆగామి అని మూడు కర్మలు ఉన్నాయి కదా. ప్రారబ్ధం ఎవడైనా అనుభవించి తీరాలి అని చెపుతారు. ఈ జన్మలో జ్ఞానం కలిగింది అనుకోండి సంచితం పోతుంది, అగామి పోతుంది కాని ఏ కర్మానుభవం కోసం ఈ దేహం వచ్చిందో ఎంతటి వారైనా అది అనుభవించే తీరాలి అని శాస్త్రం చెపుతోంది. దానిని భగవాన్ ఏమాత్రం అంగీకరించలేదు. అసలు కర్మ అనుభవించేవాడు ఎవడు? దేహబుద్ధి

ఉన్నవాడు కర్మ అనుభవిస్తాడు, దేహబుద్ధి లేనివాడిని ప్రారబ్ధం ఏమి చేస్తుంది అన్నారు. అయితే ఇప్పుడు మీరు కాన్సర్‌తో బాధపడుతున్నారు కదా అని అడిగారు. భగవాన్ కాన్సర్‌తో బాధపడుతున్నారని చూసే వారికి ప్రారబ్ధకర్మ కనబడుతోంది కాని అనుభవించటానికి లోపల ఎవడూ లేడుకదా, వాడు ఏనాడో చనిపోయాడు. జ్ఞాని ప్రారబ్ధమును అనుభవిస్తున్నాడు అని చూసేవాడు అనుకొంటాడు కాని అనుభవించేవాడు అక్కడలేడు. ప్రారబ్ధం ఎవరికి అంటే అహంకారానికి. అదిపోతే అనుభవించేవాడు అక్కడ లేడు. దేహం పోయేవరకు ఆగనక్కరలేదు దేహం ఉండగా దేహాభిమానం పోతే ప్రారబ్ధకర్మ వాడిని ఏమీ చేయలేదు. మీరు శిలువ వేయవలసింది మీ దేహానికి కాదు, మీ అహంకారానికి శిలువ వేయండి, దేహాభిమానానికి శిలువ వేయండి అప్పుడు మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. అగ్నికంటే గొప్పవాడు సత్పురుషుడు అని చెపుతారు. అగ్ని మనకు వెలుగునిస్తుంది. దానితోపాటు వేడిని కూడా ఇస్తుంది. కాని సత్పురుషుడు మనకు వెలుగును ఇస్తాడు, వేడిని ఇవ్వడు.

కబీరు దగ్గరకు ఒక భక్తుడు వచ్చి మేము యాత్రలకు వెళుతున్నాము., మీరు కూడా రండి అని అడిగాడు. ఇప్పుడు నేను రాలేను అని చెప్పి అక్కడ ఉన్న ఒక చేదుదోసకాయను వారికి ఇచ్చి దీనిని మీతో పాటు తీసుకొని వెళ్ళండి. మీరు ఏ నదులలో స్నానం చేస్తే అందులో దీనిని కూడా ముంచండి. మీరు ఏగుడికి వెళితే ఆగుడికి దీనిని తీసుకొని వెళ్ళి అక్కడ ఉన్న దేవుడికి ఈ దోసకాయను చూపించండి. మీరు తిరిగి వచ్చిన తరువాత నా దోసకాయను నాకు ఇచ్చేయండి అని చెప్పాడు. అలాగే వారు యాత్రలు చేసి వచ్చి దోసకాయను తిరిగి కబీరుకు ఇచ్చేసారు. కబీరు ఆ దోసకాయను కోసి అందరికీ తినమని ఇచ్చాడు. దోసకాయ ఎలా ఉంది అని కబీరు వారిని అడిగాడు. చేదుగా ఉంది అని చెప్పారు. ఇది యాత్రలు చేసింది దానిలో ఉన్న చేదు పోయిందా పోలేదు అంటే దాని బుద్ధిపోలేదు అలాగే మీ బుద్ధులు కూడా అంతే. మీకు లోపల బాగుపడాలనే బుద్ధి లేకుండా యాత్రలు చేస్తే ఇలాగే ఉంటుంది. యాంత్రికంగా పనులు చేయకూడదు. యాంత్రికంగా చేస్తే దోసకాయలాగే మన బుద్ధి మారదు. ముందు

మనకు బాగుపడాలనే బుద్ధి ఉండాలి. మనం పవిత్రులం అవ్వాలనే బుద్ధి ఉంటే ఎంతో కొంత మనకు పవిత్రత వస్తుంది.

దేవుడు లేడు, దేవుడు లేడు అని కొంతమంది చెపుతూ ఉంటారు. దేవుడు లేడు అని చెప్పేవాడికి కూడా మమకారం ఉంది కదా. దేవుడు లేడు అని చెప్పే బదులు సాధన చేసి వాడికి ఉన్న మమకారం పోగొట్టుకొంటే వాడు దేవుడితో సమానం అవుతాడు. పూర్వజన్మలో మనం మంచి చేసి ఉండవచ్చు, చెడు చేసి ఉండవచ్చు. ఈ దేహంలో కొంత అనుభవిస్తున్నాము. ఇంకేమీ లేదు అని మీరు అనుకోవద్దు. రాబోయే జన్మలలో మీరు అనుభవించవలసిన కర్మ చాలా ఉంది. డబ్బాలో బియ్యం అయిపోతే అయిపోయింది అనుకోకండి. గాదెలో వడ్లు రెడీగా ఉన్నాయి. ఒకే శరీరంలో మీరు ఆ కర్మ అంతా అనుభవించలేరని పాపండబ్బాలో కొంచం బియ్యం, పుణ్యండబ్బాలో కొంచం బియ్యం కలిపి మీకు దేహాన్ని భగవంతుడు ఇచ్చాడు. ఏదో కొన్ని రోజలు కాలక్షేపం చేస్తే మనం చనిపోతాము తరువాత ఇంక కర్మలేదు అని మీరుఅనుకోవద్దు. గాదిలో నుండి సప్లయి అవుతుంది. వేటగాడు ఏ విధంగా జంతువును వెంటాడుతాడో ఆ జంతువును చంపటానికి అలాగ కర్మానుభవం ఎవడైతే అనుభవిస్తున్నాడో వాడిని వెంటాడి వేటాడి వాడిని సంహరించి నప్పడు కర్మ తప్పకొంటుంది గాని లేకపోతే నీవు కోటిజన్మలు ఎత్తినా కర్మ నిన్ను వదలదు. మీలో మీకు తెలియని మంచి గుణాలు, చెడు గుణాలు ఉండవచ్చు. అవి మీకు కనబడటం లేదు కాబట్టి అవి లేవు అనుకొంటున్నారు. ఏజన్మకు ఆ జన్మ అవి వస్తూనే ఉంటాయి. గుణాల జోలికి వెళ్ళవద్దు. ఈ గుణాలు అన్నీ నేను అనే తలంపును అంటిపెట్టుకొని ఉంటాయి. దానిని విచారణ చేసి వేరుతో సహా తొలగించుకో. అప్పడు ఏ గుణాలు నిన్ను ఏమీ చేయలేవు. అనుభవించేది జీవుడు, అనుభవింపజేసేది ఈశ్వరుడు ఎప్పడు ఎక్కడ అది నీకు అనుభవింప చేయాలో నిర్ణయించేది ఈశ్వరుడు. ఈ లోపుగా గురువు అనుగ్రహం వలన నీకు బ్రహ్మానుభవం కలిగింది అనుకో అప్పడు అనుభవించేవాడు లేడు, అనుభవింపజేసే వాడు లేడు. మనస్సులో మాయ ఉన్నప్పడు జగత్తు ఉంది., జీవుడు ఉన్నాడు, ఈశ్వరుడు ఉన్నాడు, కర్మానుభవం ఉంది. మనస్సులో

మాయలేనప్పడు ఏదీ లేదు. ప్రభువా మా పొరపాట్లు క్షమించి మమ్మల్ని ఆశీర్వదించు అంటారు. ఈశ్వరుడు వారి పొరపాట్లను క్షమించాడు అనుకోండి వారికి పునర్జన్మలు తేలికగా ఉంటాయి, క్షమించకుండా అలాగే ఉంచేస్తే రాబోయే జన్మలలో అవి బండరాళ్ళుగా తయారవుతాయి. ఈశ్వరుడు నీవు చేసిన కర్మను తీసివేయడు, లేని దానిని చేర్చడు. కర్మానుభవం ఈజన్మలో దాటిపోతే ఇంకరాదుఅనుకోవద్దు. ఏదో జన్మలో ఈశ్వరుడు కలుగచేస్తాడు. ఈ గొడవలు నీకు ఎందుకు? కర్మ ఎవరికైతే అనుభవం లోనికి వస్తోందో వాడిని తొలగించుకొంటే ఏమీ లేదు. నీవు పుణ్య కర్మలు చేస్తున్నావు అనుకో మంచి కర్మలు చేస్తున్నావు అనుకో నీవుచేసిన మంచిపనులను సహాయంగా తీసుకొని ఆధ్యాత్మిక అభివృద్ధి పొందాలనే గుణం నీకు కలుగజేస్తాడు, ఆధ్యాత్మిక మార్గంలో అభివృద్ధిలోనికి రావాలనే వేదన లోపలనుండి కలుగజేస్తాడు. భగవంతుడు చేసే సహాయం అది ఏది శాశ్వతంగా ఉంటుంది అంటే ఒక్క ధర్మం మాత్రమే శాశ్వతంగా, స్థిరంగా ఉంటుంది. మిగతావి అన్నీ కూడా నీవు చేసే మంచి పనులు, చెడు పనులు అన్నీ కూడా కాలప్రవాహంలో కొట్టుకొని పోతాయి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 8-4-2000, రాజోలు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మత సమైక్యతకోసం ఎక్కువ కృషి చేసిన సెయింట్స్‌లో షిర్డీబాబా ఒకరు. ఆయన రాముడికి, అల్లాకు ఎప్పడూ బేధం చూడలేదు. మతబేధాలు ఎవరైనా తీసుకొనివస్తే ఆయన సహించేవారు కాదు. వాటిని ఖండించేవారు. వేరేమతం వాడిని మన మతంలోనికి లాగేసాను అని ఎవరైనా చెపితే నీకు బుద్ధిలేదా మతం మార్చటం అంటే తల్లిదండ్రులను మార్చుకొన్నట్లే అని బాబా చెప్పేవారు. మీరు ఏ మతంలో ఉన్నారో ఆ మతంలో తరించటానికి తగిన సామాగ్రి ఉంది, ఆ దేవుడిని ప్రార్థించుకోండి, మీరు బాగుపడండి అంతే గాని మతాలు మార్చుకోవద్దు. ముస్లిములు బాబా మావాడు అని

చెపతారు, హిందువులు బాబా మావాడు అని చెపుతారు. బాబాను మీ తల్లిదండ్రులు ఎవరు అనిఅడిగితే మాతల్లి మాయ, మా తండ్రి భగవంతుడు అని చెప్పేవారు. మాయ వలన భగవంతుడి వలన ఈ శరీరం వచ్చింది అని చెప్పేవారు. బాబాకు రెండు పండుగలు అంటే ఇష్టం. 1. గురుపౌర్ణిమ. మీకు ఏ గురువు అయితే ఇష్టమో ఆ గురువును త్రికరణశుద్ధిగా ఆరాధించండి. మిమ్మల్ని గైడ్ చేసేవాడు గురువు. 2. శ్రీరామనవమి, ఈ రెండు పండుగలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చేవారు. సుందరకాండకు మించిన గ్రంధం లేదు అని బాబా చెప్పేవారు. హనుమాన్ నేను వేరు కాదు. హనుమాన్‌ను స్మరిస్తే నన్ను స్మరించినట్లే అని బాబా చెప్పేవారు. కాంప్లికేట్ విషయాలు ఏమీ బాబా చెప్పలేదు. ప్రాక్టికల్‌గా మనిషికి ఉపయోగపడే విషయాలు చెప్పేవారు.

బాబా షిర్డీలో ఒక మసీదులో ఉండేవారు. దానికి ద్వారకామాయి అని పేరు పెట్టారు. దానికి ఎదురుగా ఒక తులసి మొక్కను పెంచి పూజించేవారు. ఒక రోజు బాబా తన దగ్గర కూర్చొన్న భక్తురాలు లక్ష్మీభాయితో ఈ రోజు నాకు ఆకలిగా ఉంది అని చెప్పారు. పూరీలు తెమ్మంటారా అని ఆ భక్తురాలు బాబాతోఅంటే సరే అన్నారు. లక్ష్మీభాయి ఇంటికి వెళ్ళి 4 పూరీలు చేసి తెచ్చింది. బాబా అందులో ఒకటితిని మిగిలిన మూడు ఎదురుగా ఉన్న కుక్కకు పెట్టారు. ఆయనకు ఆకలిగా ఉంది అంటే తెచ్చాను ఒకటితిని మిగిలినవి కుక్కకు పెట్టారు నన్ను అగౌరవపరచినట్లు కదా అని అక్ష్మీభాయి బాధపడింది. అప్పుడు బాబా ఏమి చెప్పారు అంటే ఆకలిగా ఉంటే మనిషి చెపుతాడు జంతువులు చెప్పలేవు. మనలో ఉన్న జఠరాగ్ని వాటిలో ఉన్న జఠరాగ్ని కూడా భగవంతుడి భేధం చూడనక్కరలేదు అని చెప్పారు. పూరీలు అసలు కుక్కకోసమే తెమ్మన్నాను నాకోసం అని ఎందుకు చెప్పాను అంటే జఠరాగ్ని ఎవరిదైనా ఒక్కటే. లోకం యొక్క గౌరవం అంతా మిధ్య అని బాబా చెప్పారు. మీరు ఏ పని చేసినా హృదయపూర్వకంగా చేయండి ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతారు. రాళ్ళు ఎవరైనా మీమీద వేస్తే మీకు తగులుతాయి. ఎవరైనా మిమ్మల్ని విమర్శిస్తే ఆ మాటలు మీకు తగలవు కదా. ఆ మాటలు గాలికి పోతాయి. ఆ మాటలకు కంగారుపడి మీ మానసిక ఆరోగ్యం పాడుచేసుకోవటం ఎందుకు? అందుచేత ఆ

మాటలను గాలికి వదిలివేయండి. మీరు బాగుపడే విధానం చూసుకోండి.

చావు పుట్టుకలు, పుణ్యపాపములు మంచి చెడ్డలు, ఈ గొడవ వద్దు. అన్నీ కాలమే తీసుకొని వస్తుంది. ఏ కాలం అయితే పుట్టుక తీసుకొని వచ్చిందో ఆ కాలమే చావుని తీసుకొని వస్తుంది. నీ హృదయంలో ఉన్న శాంతి నీకు దొరికితే ఎవరైనా మీ గురించి మంచి అనుకొటే ఏముంది? చెడ్డఅనుకొంటే ఏముంది? వాటి గొడవే మీకు ఉండదు. మనం ఎంతసేపు దేహంతోటి, ఇంద్రియాలతోటి కలసి ఉంటాము. చనిపోయేవరకు ఈ గొడవే తప్ప ఇంకో గొడవ మనకు లేదు. ఇంక భక్తి విలువ మీకు ఏమి తెలుస్తుంది, నీవు ఎప్పడు బాగుపడతావు. మనిషిని బాగుచేయటం కోసం బాబా ఒకోసారి చాలా కఠినంగా చెప్పేవారు, కొంత మందిని కొట్టేవారుకూడా. ఎందుకు అలా కొట్టారు అని అడిగితే అలా కొట్టి ఆవాసనను తొలగించకపోతే ఆ వాసన కొన్ని వేల జన్మలకు తీసుకొని పోతుంది అని బాబాచెప్పారు.

నాకు సంకల్పాలు రాకూడదు, తలంపులు రాకూడదు అంటే అవిఆగవు. మనోమూలంలోనికి వెళ్ళి మనస్సు అక్కడ స్థిరంగా ఉండేవరకూ సంకల్పాలు రావటం అగవు, రాగద్వేషాలు రావటం అగవు. అన్నం పూర్తిగా తిని అయిదునిమిషాలలో అరిగిపోతే బాగుండునుఅని అంటే అదిఅరుగుతుందా? అరగదు అలాగే నీ హృదయంలోనికి వెళ్ళేవరకు మంచి తలంపులో చెడు తలంపులో ఏదో ఒక తలంపులు వస్తూనే ఉంటాయి. నీ మనస్సు హృదయంలోస్థిరపడినప్పుడు సంకల్పాలు రావటం ఆగుతాయి గాని అంతవరకు అవి వస్తూనే ఉంటాయి. విశ్వం అన్నా, విష్ణువు అన్నా ఒక్కటే. విశ్వాన్ని అంతా విష్ణురూపంలోనే చూడు. అప్పడు భేదబుద్ధి నశిస్తుంది. నీ మాటవలన, చేతవలన, ఆలోచనవలన నీకు చిత్తశుద్ధి కలగాలి. చిత్తశుద్ధి లేకపోతే నీకు జ్ఞానదృష్టి కలుగదు. కేవలం నీవు పూజ చేయటం వలన మహాత్ముడవు అయిపోవు. ఇంద్రియాలను జయిస్తే నీకు చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి కలిగితే నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. మనం శ్రీరామనవమి చేస్తాము. మనం రాముడిగా ఉండము, లక్ష్మణుడిగా ఉండము, భరతుడిగా ఉండము, శత్రుఘ్నుడిగా ఉండము. ఇంకమనం ఎందుకు శ్రీరామనవమి చేయటం?

భరతుడు అన్నగారిని ఎలాచూపాడు దైవంగా చూసాడు మనం అలాచూస్తున్నామా? శ్రీరామనవమి చేయటం వలన కనీసం రాముడిలక్షణాలు, రాముడి అన్నదమ్ములలో ఉన్న వైభవం అయినా నీకు చింతనకు రావాలి కదా అదీ బాబా చెప్పేది.

ఇతరులు నీ పట్ల ఎలా ఉన్నారు అనేది అనవసరం. నీవు అందరిని ప్రేమించు అందరి పట్లదయకలిగి ఉండు, సద్భావన పెంచుకో, సత్కర్మకు దగ్గరగా ఉండు. దుష్కర్మ ఎవరైనే చూస్తూంటేవారిని విమర్శించవద్దు. అలా విమర్శిస్తూ ఉంటే మన జీవుడు పాడైపోతాడు. దుష్కర్మకు దూరంగా ఉండు. దేహం ఇంద్రియాలు ముఖ్యం కాదు. దేహం లోపల ఉన్న జీవుడిని పవిత్రం చేసుకోవటం ముఖ్యం. దుష్కర్మకు సత్పురుషుడు అంటే భయం. సత్పురుషుడికి దుష్కర్మ అంటే భయం. ఇద్దరు ఒకరికి చూసి ఒకరు భయపడతారు. అందుచేత నీవు మంచిని పెంచుకోంటే వెళుతున్నావు అనుకో, ప్రేమను పెంచుకొంటూ వెళుతున్నావు అనుకో భగవంతుడిలో ఐఖ్యమవుతావు దీనికి వేదపారాయణ అక్కరలేదు అని బాబా చెప్పారు. ఈశ్వరుడి పట్ల నీకు సజీవమైన విశ్వాసం, శాశ్వతమైన ప్రేమ కలిగింది అనుకో నీకు వేద పారాయణతో సంబంధం లేకుండానే నీవు చేరవలసిన చోటుకు చేరతావు. మంచి చేసినవాడికి మంచి, చెడ్డచేసిన వాడికి చెడ్డ వాడి వెనకాలే వస్తూ ఉంటాయి. కొంతమందికి డబ్బు ఉంటే చాలు ఇంకేమీ అక్కరలేదు. వారిని అర్థాందులు అంటారు. అంటే వారి డబ్బు వారికి గుడ్డితనం తీసుకొనివస్తుంది. డబ్బు సంపాదించటం కంటే దానిని సద్వినియోగం చేయటం ఇంకా కష్టం. గుడిలోనికి వెళ్ళటం ఎందుకు అంటే మీ హృదయాన్ని దేవాలయంగా చేసుకోవటం కోసం గుడికివెళ్ళటం. గుడికి వెళ్ళకుండానే దైనందిన జీవితంలో నీ ప్రవర్తనను సరిచేసుకొంటూ నీ హృదయాన్ని దేవాలయంగా మార్చుకొంటే ఇంకా మంచిది. ఆధ్మాత్మిక విషయాలను ఎప్పడూ కాంప్లికేటెడ్‌గా బాబా చెప్పలేదు. మనకు అర్ధమయ్యే మాటలలో చెప్పేవారు. మనం బాగుపడటం ఆయనకు ముఖ్యం. నీవు ఏ శాస్త్రము పారాయణ చేస్తున్నావు అని బాబా చూసేవారు కాదు ఏ కారణం వలన నీవు పాడైపోతున్నావో చూసి అందులోనుండి నిన్ను బయటకు తీసుకొని రావటానికి ప్రయత్నం చేసేవారు. నీ శరీరం యొక్క అందాన్ని, నీ

సంపదను చూసుకొని నీవు పొంగిపోతూ ఉంటే నీకు జ్ఞానం ఏమిటి అనేవారు బాబా. ఎవరికైనా ఏదైనా విషయం చెప్పేటప్పుపు వారు ఏ స్థితిలోన్నారో అర్థం చేసుకొని ఆ స్థాయికి వెళ్ళి విషయం విషయం చెప్పి వారిని అభివృద్ధిలోనికి తీసుకొని రావాలి అంతేగాని వారు అప్పడు ఉన్న స్థితిని చెడగొట్టకూడదు.

నీవు ధనమదంతోటి, విద్యామదంతోటి కొట్టుకొంటూ ఉంటే నీ హృదయంలో ఉన్న నీ స్వరూపానికి అనుగుణంగా నీవు ఎలా జీవించగలవు. నీకు రసమయ జీవితం ఉండదు. హృదయంలో ఉన్న ఆనందం, శాంతి నీకు అందదు. ద్వారకామాయిలో ఒకభక్తుడు పడుకొన్నాడు. ఆయన అంతర్యామిఅని చెప్పటంకోసం ఇదిచెపుతున్నాను. నిద్రపోతున్నవాడిని బాబా తట్టి లేపారు. వాడు నిద్రనుండి లేచి ఏమిటి బాబా అని అడిగాడు. కొన్ని క్షణాలలో విషసర్పం ఇక్కడకు వస్తోంది ప్రక్కకు తప్పకో అని బాబా చెప్పారు. వాడు పక్కకు తప్పకొన్నాడు. అంతే ఆ సర్పం అక్కడకు వచ్చింది. అంటే మనం నిద్రపోతున్నా మన రక్షకుడు నిద్రపోవటం లేదు. ఎవరైనా నీ దగ్గరకు దుఃఖముతో వస్తే వారికి ఉపశమనం చేసి పంపాలి గాని పుండు మీదు కారం చల్లినట్లు చేసి పంపకూడదు. పుండుతో నీ దగ్గరకు వస్తే నీ దగ్గర ఆయింట్‌మెంట్ ఉంటేరాయి లేకపోతే పంపేయి అంతేగాని దాని మీద కారం చల్లకు అది బాబాచెప్పేది. ఎవరైనా నీ దగ్గకు కష్టంతో వస్తే వాడికి చేతనయిన సహాయం చేస్తే వాడి కష్టం తగ్గినా తగ్గకపోయినా నీవు బాగుపడతావు. ఆధ్యాత్మిక పురోభివృద్ధి కలుగుతుంది. బాహ్యంగా నీవు ఏదైనా సత్కర్మ చేయవచ్చుయకాని ఆ సత్కర్మవలన నీకు గర్వం రాకూడదు, అలా గర్వంవస్తే ఆధ్మాత్మికంగా నీవు నశించిపోతావు. బాబా చెప్పిన మాటలు అర్థం చేసుకోవటానికి కూడా పూర్వజన్మలో మీరు కొంత సత్కర్మ చేసి ఉండాలి. సత్కర్మ చేసి ఉంటే దానకి సంబంధించిన సంస్కారం ఏర్పడుతుంది. ఆ సంస్కారం వలన ఆ మాట మీకు అర్థమవుతుంది. దుష్ట సంస్కారం ఉంటే శాస్త్రం ఎన్నిసార్లు చదివినా అది మీకు అర్థంకాదు. శ్రద్ధ, సహనం ఇవి రెండూ ముఖ్యం. నీవు శ్రద్ధను ఒకచేతితో, సహనాన్ని రెండో చేతితో పట్టుకోవాలి. అప్పడు నీ మనస్సు నశిస్తుంది. నీకు మోక్షానుభవం కలుగుతుంది.

5-5-2000

సర్వ అనర్థాలకు దేహాభిమానం కారణం. దేహాభిమానం నశిస్తే ఏమీలేదు. ఏ దేవుడిని ఆరాధించినా వాసనాక్షయం ముఖ్యం. చిన్న వాసన ఉంటే పునర్జన్మ వస్తుంది. దేహాన్ని సుఖపెట్టటం కోసం, మనస్సును సంతోషపెట్టటం కోసం నీవు రిపీటెడ్‌గా పని చేస్తూ ఉంటే అదే సంస్కారంగా వస్తుంది. అందులోనుండి వాసన వస్తుంది. నీ హృదయంలో ఉన్న స్వర్గం నీకు అందినప్పుడు రాబోయే జన్మల గొడవ, లోకాలగొడవ, సంతోషాల గొడవ ఏమీ నీకు ఉండదు. అది ఎప్పుడు నీకు అందుతుంది అంటే నీకు వాసనాక్షయం అయినప్పుడు అదిఅందుతుంది. దేహసౌందర్యాన్ని చూసి మురిసిపోకు, హృదయ సౌందర్యాన్ని పెంచుకో. సమాజానికి నీవు ఏదైనా చేసినా దానినుండి నీవు ఏమీ ఆశించకు, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందటం చూసుకో. Be Brave, Be Moral అని బాబా గారు చెప్పేవారు. ఎవరో ఏదో అన్నారని నీవు కంగారుపడకు. నీ నిదానంలో నీవు ఉండు. పని మొదలుపెట్టి సాయంకాలానికి అయిపోవాలి అని అనుకోవద్దు. కొబ్బరిమొక్కను ఉదయంవేసి సాయంకాలానికి కాయలు కాయాలి అని అంటే కాస్తుందా? కాయదు. నీవు సహనంగా ఉండు, నిదానంగా ఉండు, కాలం కలిసివచ్చినపుడు ఆ పని పూర్తిఅవుతుంది. ఈ లోపు నీకు కావలసింది ఆగ్రహంకాదు, నిగ్రహం కావాలి. దైవీ సంపదలేకపోతే మనం దైవాన్ని స్మరించలేము. ఆయన దయవలన మాత్రమే ఆయనను స్మరించగలము. అవసరం లేకుండా ప్రతీ దానిలో నేనును కలవనివ్వకూడదు. నీకు రెండుచేతులు ఉన్నాయి ఒకచేతితో శ్రద్ధను, ఒకచేతితో సహనాన్ని పట్టుకో నీవు గమ్యాన్ని చేరిపోతావు. నీ బుద్ధి బాగుపడితే కలియుగంలో ఉన్నా కృతయుగంలాగ ఉంటుంది, నరకానికి వెళ్ళినా అది స్వర్గంగా మారిపోతుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 10-4-2000, సిద్ధాపురం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

కేవలము విష్ణువు ఒక్కడే దేవుడు అని విష్ణువును ఉపాసన చేసే వారిని వైష్ణవులు

అని, శివుడు ఒక్కడే దేవుడు అని శివుడిని ప్రధానంగా ఆరాధించేవారిని శైవులని అంటారు. మనం ఆ పార్టీకాదు, ఈ పార్టీకాదు. మనకు విష్ణువు, శివుడు సమానమే. మనలను స్మార్తులు అంటారు. శివకేశవ బేధం లేని వారిని స్మార్తులు అంటారు. ఎన్నో సిద్ధులు ఉన్నాయి. కొంత మంది చనిపోయిన మనిషిని కూడా బ్రతికించగలరు. అటువంటి సిద్ధులు కూడా ఉన్నాయి. జ్ఞానం ముందు ఈ సిద్ధులు ఏపాటివి అనేవారు భగవాన్‌జ్ఞానం యొక్క వైభవం నీకు తెలియనప్పడు ఈ సిద్ధులు నీకు చాల గొప్పగా ఉంటాయి. జ్ఞానం యొక్క వైభవం నీకు తెలిసినప్పడు చనిపోయిన మనిషిని బ్రతికించటంకూడా ఏమీ విశేషం క్రింద నీకు అనిపించదు. ఎన్ని సిద్ధులు ఉన్నా నీకు జ్ఞానం లేకపోతే నీ పని బండిసున్నా. రామకృష్ణ పరమహంసతో ఒకరు నేను పది సంవత్సరాలు కష్టపడి నీటి మీద నడవటం నేర్చుకొన్నాను వచ్చి చూడండి అని చెప్పాడు. నీవు పది సంవత్సరాలు నేర్చుకొన్న విద్య ఒక అణా విలువ అన్నారు. మేము ఒక అణా ఇస్తే పడవ మీద నదిని దాటిస్తారు. నీవు అణా అక్కరలేకుండా నదిని దాటుతున్నావు అంటే నీవు నేర్చుకొన్న విద్య ఒక అణా విలువ అని రామకృష్ణుడు చెప్పాడు. నీకు జ్ఞానం లేనప్పడు ఇవి అన్నీ బ్రహ్మాండముగా కనిపిస్తాయి. ఇవి అన్నీ తాత్కాలిక విషయములు. ఏది అయితే సత్యం కాదో, ఏది అయితే నిత్యం కాదో దాని కోసం ఎగపడటం ఎందుకు? నీ కాలాన్ని, శక్తిని దుర్వినియోగం చేసుకోవటం ఎందుకు? నీ మనస్సు అణిగినప్పడు, నీ మనస్సు నిర్మలం అయినప్పడు ఈ సృష్టిలో ఎవరూ నీకు దుఃఖం తీసుకొని రాలేరు. నీకు ఇప్పడు సుఖం లేదు, శాంతి లేదు, పూర్వజన్మలు ఏమిటో నీకు తెలుస్తున్నాయి అనుకోండి దాని వలన ఏమిటి ప్రయోజనం? లోకంలో అనేక ఆకర్షణలు ఉంటాయి. అందులో ఏ ఆకర్షణలో మనం పడినా గమ్యానికి వెళ్ళలేము. భగవంతుడు నీకు జ్ఞానమే ఇచ్చేటప్పడు ఇంక సిద్ధులు కోసం వేడుకోవలసిన పనిలేదు. సిద్ధుల వలన మోక్షం రాదు, జ్ఞానం వలన మోక్షం కలుగుతుంది. జ్ఞానం కలిగిన తరువాత సిద్ధులు స్వప్నసమానం అని నీకు తెలుస్తుంది. సిద్ధులు అశుద్ధంతో సమానము వాటి జోలికి వెళ్ళకండి, బ్రహ్మానుభవం పొందటం కోసం ప్రయత్నం చేయండి అని రామకృష్ణుడు చెప్పాడు. నీ హృదయంలో ఈశ్వరుడు నివాసంగా

ఉంటే, ఆయనకోసం నీవు తపిస్తే నీకు జ్ఞానం వస్తుంది, సిద్ధులు వస్తాయి. జ్ఞానం వచ్చిన తరువాత మీకు సిద్ధులు వస్తే పరవాలేదు, జ్ఞానం రాకుండా మీకు సిద్ధులు వస్తే మీరు మాయలో పడతారు, మీ సిద్ధులే మిమ్మల్ని పాడుచేస్తాయి. భగవంతుడికి పాదాక్రాంతుడు అయినవాడు ఏ సిద్ధులు కోరుకోడు. మీకు భగవంతుని మీద నిజమైన ప్రేమ కలిగితే సిద్ధులు కావాలనే సంకల్పం కూడా మీకు ఉదయించదు. నీవు కోరికల కోసం, సిద్ధులకోసం భగవంతుని ఆరాధిస్తూ ఉంటే ఇంకా మాయలో బిగుసుకొని పోతావు, ఉరితాడు బిగుసుకొని పోతుంది. నీవు ఏదికోరితే అది ఈ జన్మలో కాకపోయినా వచ్చే జన్మలో అయినా తీరుస్తాడు, అవి ఎంతవరకు నీకు మేలుచేస్తాయి. సిద్ధులు ప్రదర్శించే శక్తి మీకు వచ్చింది అనుకోండి దాని వలన మీ మనస్సు బలపడుతుంది, దేహాభిమానం పెరిగిపోతుంది.

మీరు ఎందుకు మోక్షాన్ని కోరుకొంటున్నారు? ఇప్పుడు ఎలా ఉన్నారో ఆ స్థితిలో ఉండవచ్చుకదా అంటున్నారు భగవాన్. ఇప్పుడు మీరు ఉన్న స్థితి నిజంకాదు. మీకు ఎన్ని సంపదలు ఉన్నా మీలోపల ఏదో వెలితి ఉంది అది మీకు తెలుస్తుంది. అందువలన మీరు మోక్షాన్ని కోరుకొంటున్నారు. ఏదైతే నిజమో అక్కడకు వెళ్ళేవరకు నీ బుద్ధి ఆగదు. ఈ లోపు నిజం కానిదానిని నిజం అని నమ్మవచ్చు. అది నిజంకాదు అని తెలిసిన తరువాత దానిని వదిలేస్తుంది. జ్ఞాన సముపార్జన మీదే మీ దృష్టి ఉండాలి. మనం ఇది భౌతికం ఇది ఆధ్యాత్మికం అని వేరుచేస్తున్నాము. ఇలా వేరుచేయటం వలననే వస్తువు మనకుఅర్థం కావటంలేదు. విశ్వం, విష్ణువు రెండూ ఒక్కటే. మనం దేహానికి, లోకానికి బంధింపబడ్డాము కాని రాముడి పాదాలకు బంధింపబడలేదు. దేవుడు ఉన్నాడని నోటితో చెపుతాము కాని ఆయన మీద మనకు విశ్వాసం లేదు. దానికి స్వార్థమే కారణం. ఎవరో మిమ్మల్ని శత్రువులు అనుకొంటే మీకు ప్రమాదం లేదు, మీరు ఎవరినీ శత్రువులుగా భావించవద్దు. దాని వలన మీ మనస్సు బాహ్యాముఖానికి వెళ్ళిపోతుంది. మీకు శత్రుభావన అలాగే ఉండిపోతే జన్మాంతరంలో కూడా మీమమనస్సు కూడా శత్రుభావన వచ్చేస్తుంది. రాబోయేజన్మలో కడా శత్రువులుగానే పుడతారు. మీకు మహిమలు వస్తే

వాటిని ప్రదర్శించాలని, అందరూ మిమ్మల్ని గౌరవించాలని ఇటువంటి బుద్ధులు వస్తాయి. మెప్పులు కోరతారు. మెప్పులు కోరితే ఇంక తిప్పలు తప్పవు. ఎదుటి వారు మిమ్మల్ని మెచ్చుకోవాలనుకోవటం అది దరిద్రలక్షణం. ఎవరో మెప్పకోసం మీరు ఉపకారం చేస్తారు. వారు మెచ్చుకోకపోతే మీకు దుఃఖం వస్తుంది. మీకంటే ఇంకొకరు ఎక్కువ ఉపకారం చేస్తే మీకు అసూయ వస్తుంది. ఇవి అన్నీ జీవలక్షణాలు. దేహాభిమానం చుట్టూ తిరగటం వలన ఈ అల్లరి అంతా వస్తోంది. తల్లి కూతురుకు ఏదైనా ఇస్తే ఆ కూతురు మెచ్చుకోవాలని అనుకొంటుంది. ఇవి జీవలక్షణాలు ఈ జీవలక్షణాలు దాటితే గాని రాముడిపాదాలు దొరకవు. చెట్టు చిటారుకొమ్మ ఆకుమీద నిద్రపోవాలనుకోవటం ఎటువంటిదో జీవలక్షణాలు దాటకుండా మోక్షం పొందాలనుకోవటం అటువంటిదే. దేశంలో ఉన్న దారిద్ర్యం అంతా పోగొట్టవచ్చు గాని మనస్సులో ఉన్న దారిద్ర్యం నీవు తొలగించుకోలేవు. ప్రపంచాన్ని జయించగలవుగాని మనస్సును జయించటం కష్టం. ప్రపంచాన్ని జయించిన వాడు దేవుడు కాదు, మనస్సును జయించినవాడు దేవుడు అవుతాడు. ఇందులో ఉన్న చిక్కు మీరు అర్థం చేసుకోండి. ఏ వస్తువును తెలుసుకొన్నాక మీకు శాంతి కలుగుతుందో ఆ వస్తువును తెలుసుకోండి, ఆ సిద్ధిని కోరుకోండి. చనిపోయిన మనిషిని బ్రతికించటం కాదు మీరు కోరుకొనేది. ఇవాళ వాడిని మీరు బ్రతికించినా రేపు ఎలాగూ పోతాడు. ఈ గొడవలు వద్దు. మీరు ఆత్మసిద్ధిని కోరుకోండి. మనస్సులో మాయ ఉంది. అందులోనుండి బయటకు రావాలంటే స్వామీజి ఏమి చెప్పారు అంటే సముద్రంలో బుడగలు ఉంటాయి. కెరటాలు ఉంటాయి, నురుగు ఉంటుంది. కెరటాన్ని కెరటంగా చూడకు నీరుగానే చూడు, బుడగలో కూడా నీరునే చూడు, నురుగులో కూడా నీరునే చూడు. వీటి అన్నింటిలో ఉన్నది నీరే. అందువలన నీటినే చూడు. అప్పుడు నామ, రూప దృష్టి పోతుంది. అఖండ దృష్టి నీకు కలుగుతుంది.

****